- ఓటర్ల జాబితా సవరణకు ఈసీ నోటిఫికేషన్
- రేపు తుది జాబితా ప్రకటన
- ఎన్నికలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు
- గెలుపు కోసం ఆశావహుల యత్నం



చింతలమానేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఇప్పటికే పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితాను మరోసారి సవరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. ఇందుకు గాను ఈ నెల 20 నుంచి 23 వరకు గ్రామాల్లో ఓటరు జాబితా సవరణ కోసం రెండు రోజుల క్రితం షెడ్యూల్ ప్రకటించింది. 23న తుది జాబితాను ప్రకటించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నందున గ్రామాల్లో రాజకీయం వేడెక్కుతోంది. అధికారులు సైతం ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దీంతో ఆశావహులు ప్రజల్లోకి వెళుతూ ప్రచారం ప్రారంభించారు. జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,874 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 3,53,895 ఉన్నారు. ఇందులో పురుషులు 1,76,606, మహిళలు 1,77,269, ఇతరులు 20 మంది ఉన్నారు.

పాలకవర్గాలు లేక..

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో సమస్యలు పేరుకు పోతున్నాయి. పారిశుధ్యం, వీధి దీపాలు, ఇతర సమస్యలు రాజ్యమేలుతున్నాయి. 2019 జనవరిలో పంచాయతీ ఎన్నికలు జరగ్గా అదే యేడాది ఫిబ్రవరి 2న పాలక వర్గాలు బాధ్యతలు చేపట్టాయి. వీరి పదవీ కాలం 2024 ఫిబ్రవరి 1న ముగిసినప్పటికీ ఇప్పటి వరకు ఎన్నికలు జరగలేదు. దీంతో దాదాపు రెండేళ్లుగా ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. 2019 మేలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అదే యేడాది జూన్ 4వ తేదీన పరిషత్ పాలకవర్గాలు ఏర్పాటు అయ్యాయి. గత యేడాది జూన్‌తో పదవీ కాలం ముగియగా దాదాపుగా 17 నెలల నుంచి ఎన్నికలు జరగలేదు. దీంతో ఆయా గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం ఆగిపోయాయి. గ్రామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు దక్కాలంటే పంచాయతీల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కాగా ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు త్వరలోనే జరుగుతాయంటూ హడావుడి చేయడం, ఆపై మరుగున పడడం సాధారణమైంది. ఐదారు నెలలుగా నేడో, రేపో నోటిఫికేషన్ వస్తుందని ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అధికార కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ఆయా నియోజక వర్గాలలోని మండలాల వారీగా సమావేశాలు, పర్యటనలు సైతం పూర్తి చేసు_న్నారు. అయితే కులగణన, బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయంతో ఎన్నికలు నిర్వహిస్తామని నోటిఫికేషన్ ఇచ్చినట్టే ఇచ్చి హైకోర్టు తీర్పుతో వాయిదా పడ్డ విషయం విధితమే. ఎన్నికలు వాయిదా పడడంతో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేది తేలకపోవడంతో ఆశావహులు కూడా స్తబ్దంగా ఉండిపోయారు.

ఎన్నికల సంఘం వైపు చూపు..

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. మంత్రి మండలి లేఖ ఆధారంగా ఎన్నికల సంఘం సర్పంచ్ ఎన్నికలకు ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేస్తుందోనన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది. పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహిస్తుండడంతో గతంలో పోటీ చేసిన నాయకులు సైతం పోటీకి సిద్ధమవుతున్నారు. గతంలో ఇచ్చిన రిజర్వేషన్లే ఇస్తారా.. లేక మారుస్తారా అనుకున్న రిజర్వేషన్ వస్తుందో లేదోనన్న సందిగ్ధం పోటీ దారుల్లో నెలకొంది. ఒకవేళ రిజర్వేషన్ కలిసి రాకపోతే త్వరలో జరిగే జడ్పీటీసీ, ఎంపిటీసీలకు పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల వరకు ఎలాంటి రిజర్వేషన్ వస్తుందనే దానిపై రాజకీయ పార్టీలతో పాటు ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

ఎస్పీగా నితిక పంత్



నితిక పంత్, ఎస్పీ

ఆసిఫాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా 2017 బ్యాచ్‌కు చెందిన నితిక పంత్‌ను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 32 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులను జారీ చేశారు. ఇందులో భాగంగా ఆసిఫాబాద్ ఎస్పీగా ఆదిలాబాద్ యాపల్‌గూడలో గల జిల్లా రెండో బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మహిళ ఐపీఎస్ నికిత పంత్‌ను బదిలీ చేశారు. ప్రస్తుతం జిల్లా ఎస్పీగా పని చేస్తున్న కాంతిలాల్ పాటిల్‌ను గవర్నర్ ఏడీసీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాంతిలాల్ పాటిల్ ఈ ఏడాది జూన్ 5న ఆసిఫాబాద్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. కేవలం ఐదు నెలల 15 రోజులు మాత్రమే పని చేశారు. కాగా కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పడిన తర్వాత మొట్ట మొదటి సారిగా మహిళా ఐపీఎస్‌కు ఎస్పీ బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది.

పాఠశాలల పని వేళలు మార్చాలి

ఆసిఫాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత అధికంగా ఉన్నందున పాఠశాలల పని వేళలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మార్చాలని కోరుతూ పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్‌లు శుక్రవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. డీఈవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న పరీక్షల సహాయ కమిషనర్ పోస్టులో గెజిటెడ్ హెడ్మాస్టర్‌ను నియమించాలని కోరారు. కో ఆర్డినేటర్ల నియమక ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రకాష్, రాకేష్, శ్రీనివాస్, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రావణి కుటుంబానికి అండగా నిలుస్తాం

దహెగాం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం గెర్రె గ్రామంలో హత్యకు గురైన శ్రావణి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్యకు పాల్పడిన నిందితులను ఉరి శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు బాలునాయక్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి

తిర్యాణి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఉట్నూర్‌లో నిర్వహించే ఆదివాసీల ధర్మ యుద్ధ భారీ బహిరంగ సభకు ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు గణపతి పిలుపునిచ్చారు. మండలంలోని తాటిగూడ, తదితర గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడా హటావో.. ఆదివాసీ బచావో నినాదంతో నిర్వహించే చలో ఉట్నూర్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు సాగర్, లక్ష్మణ్, రమేష్, మహేష్, సురేష్, లింగు, జుగాది, నాగురావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లాలో అథ్లెటిక్స్ ఫెరేషన్ ఆఫ్ ఇండియా, ఖేలో ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించే ఖేలో ఇండియా అస్మిత లీగ్స్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవిల చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభకనబర్చిన వారిని జాతీయ స్థాయి క్యాంపులకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ అధయక్షుడు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి: పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు శుక్రవారం టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేందర్‌రావు, పర్వతి రాజశేఖర్ సభ్యులు సతీష్, మహేష్, సంతోష్, రవి, లక్ష్మణ్, నాగేందర్, కిరణ్, సమీర్, రాజు, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కెరమెరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐయూ మండల కన్వీనర్ ఆనంద్‌రావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేడయంలో పాత్రికేయులు ముఖ్య ప్రాత పోషిస్తున్నారని అన్నారు. అధికారులు వెంటనే వారికి ఇళ్ల, ఇంటి స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపద రక్షణ అందరి బాధ్యత



పోడు భూములను పరిశీలిస్తున్న అధికారులు

చింతలమానేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అటవీ సంపద రక్షణ అందరి బాధ్యత అని రాష్ట్ర ఏసీసీఎఫ్ ఎలీసింగ్ మేరు అన్నారు. మండలంలోని కర్జవెల్లి రేంజ్ అటవీ ప్రాంతంలో శుక్రవారం పర్యటించారు. రేంజ్ పరిధిలోని దిందా, బండల్‌హెటి అటవీ ప్రాంతంలో ఉన్న పోడు భూములను, అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న భూములను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటారు. సిబ్బందికి అటవీ రక్షణ కోసం ఫైర, పెట్రోలింగ్‌కు సంబంధించిన వాహనం అందజేశారు .అడవుల ప్రాముఖయత, అటవీ జంతువుల సంరక్షణపై గ్రామాల్లో ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీటీ శాంతారాం, డీఎఫ్‌వో నీరజకుమార్ టిబ్రేవాల్, డీఎఫ్‌వో సుశాంత్, ఎఫ్ఆర్వో సుభాష్, ఎస్సై నరేష్, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు ఉన్నారు.

ఉద్యోగి కుటుంబీకులకు చెక్కుల అందజేత

రెబ్బెన, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగం చేస్తూ ఇటీలవ మృతి చెందిన ఈపీ ఆపరేటర్ వీర్ల శ్రీధర్ కుటుంబ సభ్యులకు శుక్రవారం కైరిగూడ ప్రాజెక్టు అధికారి నరేందర్ చెక్కును అందజేశారు. ఇందులో జీఐఎస్ చెక్కు రూ. 1.20 లక్షలతో పాటు ఎంఎంసీ మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, ఎస్ఓటు జీఎం రాజమల్లు, మేనేజర్ శంకర్, సంక్షేమాధికారి రజినీకుమార్, నాయకుడు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎనోలిగూడలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి

వాంకిడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరి బాయి అన్నారు. మండలంలోని ఎనోలిగూడ గ్రామాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై లబ్ధిదారులకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. ఇటీవల పీఎం జన్‌మన్ ద్వారా గ్రామానికి 19 ఇళ్లు మంజూరు అయినప్పటికీ అటవీ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని తమ సమస్య పరిష్కరించాలని ఈశ్వరి బాయికి గ్రామస్థులు విన్నవించుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అటవీ ప్రాంతంలో రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కుమరం ఈశ్వరిబాయి రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో 20 కొలం గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొలాం సంఘం నాయకులు జలపతి, అన్నిగా, అన్నపూర్ణ, వగ్గు, లింగు, తుకారాం, లేతు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ రూరల్, (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం కోలాం సాలెగూడ గ్రామాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి శుక్రవారం సందర్శించి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశమై లబ్ధిదారులకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలుసుకుని సూచనలు చేశారు. పీఎంజన్ మన్ ద్వారా నూతనంగా మంజూరైనా ఇళ్లకు భూమి పూజ చేశారు. అనంతరం కుమ్ర ఈశ్వరిబాయి రాజు ఫౌండేషన్ ద్వారా గ్రా మంలోని 20 కుటుంబాలకు స్వచ్ఛందంగా దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జలపతి, కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు అవగాహన సదస్సు

రెబ్బెన, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు డిజిటల్ సర్టిఫికెట్ కాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు గోలేటి జీఎం కార్యాలయంలో సీఎంపీఎఫ్, సీపీఆర్ఎంఎస్ రెన్యూవల్ చేసుకోవడంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నామని జీఎం విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు విశ్రాంత ఉద్యోగులు, పెన్షన్ రెన్యూవల్ కోసం జీవన్ ప్రమాణ్, వైద్య సేవల కోసం హెల్త్ కార్డులు రెన్యూవల్‌ను మీ సేవ కేంద్రాల్లో మాత్రమే చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కాగా ఇప్పటి నుంచి మీసేవ కేంద్రాల్లో మాత్రమే కాకుండా ఇంట్లో తమ ఫోన్‌లోనే రెన్యూవల్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ విషయంపై అవగాహన కల్పించనున్నామని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జీఎం విజయభాస్కర్‌రెడ్డి సూచించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

దహెగాం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్, అయినం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినకొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ధా న్యం దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవా లన్నారు. లాగే ఒడ్డుగూడ- కల్వాడ 15 కిలోమీటర్ల మేరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.41 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో దత్తారావు, డీసీఎస్‌వో వసంతలక్ష్మి, డీఏవో వెంకటి, ఏడీఏ మనోహర్, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిగౌడ్, ఏవో రామకృష్ణ, తహసీల్దార్ మునావర్ షరీఫ్, పీఏసీఎస్ సీఈవో బక్కయ్య, ఏఈవోలు, కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పురం గిరిజన గ్రామానికి రోడ్డు, వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు, వంతె నిర్మాణంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రోడ్డు, వంతెన నిర్మాణానికి రూ.3.13 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఇటీవల దహెగాం మండల కేంద్రంలో సాగర్‌గౌడ్, గోపాల్ మృతి చెందడంతో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిగౌడ్, వైస్‌చైర్మన్ ధనుంజయ్, నాయకులు ప్రభాకర్‌గౌడ్, సంజీవ్, సత్యనారాయణ, రమేశ్ పాల్గొన్నారు.

గాజుల పండుగ ప్రారంభం

రెబ్బెన, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోలేటిలోని శక్తి అభియాన్, ఇందిరా ఫెలోషిప్ ఆధ్వర్యంలో గాజుల పండుగను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షురాలు సుగుణక్క, దళిత ఆదివాసీ లేడీ రత్నం, దళిత్ హక్కుల నాయకురాలు శ్రీకళ, మాలతీ, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇందిరాబాయి, ఆత్మారాంనా యక్, ప్రతిభ, మంగ, వందన, శంకరమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

షీ టీం సేవలపై అవగాహన

రెబ్బెన, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో శుక్రవారం ఏహెచ్‌టీయూ, షీ టీం సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏహెచ్‌టీయూ ఇన్‌చార్జి ఎస్సై బిక్కులాల్ మాట్లాడుతూ విద్యార్థినులు వేధింపులు, టీచింగ్, సైబర్ మోసాలకు, ఈవ్‌టీజింగ్ వంటి సమస్యలు ఎదుర్కొన్నప్పుడు వెంటనే డయల్ 100 లేదా షీ టీం హెల్ప్‌లైన్ 8712670564 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. మహిళల భద్రతను పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటోందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, బస్‌స్టాండ్‌లు, మార్కెట్ ప్రాంతాల్లో మహిళల రక్షణ కోసం ఏహెచ్‌టీయూ, షీటీంలు నియమిత పర్యవేక్షణ చేపడుతున్నామని ఎలాంటి వేధింపులైనా ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై నర్సయ్య, సిబ్బంది రజిని, స్వప్న, వరలక్ష్మి, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన ఇల్లు

తిర్యాణి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం మంగిముల్కలమంద గ్రామంలో గురువారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుని మంటలు అంటుకుని ఇల్లు కాలిపోయింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిడాం మారుతి అనే వ్యక్తి ఇంట్లో ఉన్న విద్యుత్ పరికరం నుంచి ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు వెంటనే బయటకు పరుగులు తీయడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇంట్లో ఉన్న ధాన్యం, వస్తువులు, తదితర పత్రాలు, లక్షల రూపాయల విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతున్నారు. కాగా తిర్యాణి మండలం మంగిముల్కలమంద గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్ని గ్రామంలో స్వరం కోల్పోయిన సిడాం మారుతి కుటుంబానికి అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు చేయూతనందించారు. ఈ సందర్భంగా శుక్రవారం బాధిత కుటుంబానికి బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హరీష్‌కుమార్, వెంకటేశంగౌడ్, రాంచందర్, అమర్, వినోద్, శ్రీనివాస్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ట్రైబల్ మోడల్స్ స్పోర్ట్ బాలికల క్రీడామైదానంలో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అండర్-14, అండర్-17 పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన 150 క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమాధికారి రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వెంకటేష్, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్ పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తున్న బాలికల గుర్తింపు

కాగజ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన ఆపరేషన్ నంహే పరిస్తే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైల్వే స్టేషన్ పరిసరాల్లో భిక్షాటన చేస్తున్న నలుగురు బాలికలను గుర్తించారు. ఎక్స్‌ప్రెస్ రైలు ప్లాటఫాం నంబరు 2 వద్దకు చేరుకున్న సమయంలో ఎస్ఐపీఎఫ్ ప్రాచిదేవి, ఏఎస్సై పీఎఫ్ఆర్ దాసు, కానిస్టేబుల్ అంజనేయులు బాలికలను గుర్తించి వెంటనే వారిని రైల్వే పోలీసుపోస్టుకు తరలించారు. అనంతరం బాలికల సంరక్షణ, భద్రత కోసం డీసీపీవోకు అప్పగించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వాంకిడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన లక్కారావ్ శుక్రవారం తను పోగోట్టుకున్న సెల్‌ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆసిఫాబాద్‌కు చెందిన లక్కారాం సెల్‌పోన్ ఇటీవల వాంకిడి మార్కెట్‌లో పోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్టు అందజేత



క్రికెట్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని ఉర్దూ బాలికల పాఠశాలకు చెందిన షేక్ సీమా జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో సాధన కోసం క్రికెట్ కిట్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి అందజేశారు. రాష్ట్ర స్థాయిలో రాణించి దేశం కోసం ఆడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, నాయకులు ఉన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గం

చింతలమానేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా కిరణ్‌కుమార్, కోశాధికారగా రాజన్న, ప్రధాన కార్యదర్శిగా సచిన్, కార్యదర్శులుగా రాకేష్, కునాల్, శ్రీజానందిని, శ్రీదేవి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మురళీ, శ్రీకాంత్‌గౌడ్, నిఖిల్, తిరుపతి, సాయి, తేజ పరమేశ్వర్, సంతోష్, కిరణ్ పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం



ఇంటి ముందు పెట్టిన నిమ్మకాయలు, కోడిగుడ్లు

బెల్లంపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 9వ వార్డు రైల్వే రడగంబాల బస్తీలో శుక్రవారం క్షుద్రపూజలు కలకలం రేపాయి. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు 9వ వార్డులోని ఉమేశ్ చంద్ర ఇంటికి వెళ్లే దారిలో మనిషి ఆకారంలో ఉన్న బొమ్మను, కోడి గుడ్లు, నిమ్మకాయలతో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. దీంతో వార్డు ప్రజలతో పాటు వాహనదారుడు భయాందోళనకు గురయ్యారు. గురువారం అమావాస్య కావడంతో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేపట్టారని స్థానికులు చెబుతున్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుల అరెస్టు

బెల్లంపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకు లను అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ టూటౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ పోలీసు సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా పల్సర్‌బైక్‌పై వచ్చిన బెల్లంపల్లి బస్తీకి చెందిన ఖలీం, శంషీర్‌నగర్‌కు పెట్టెం రాజేశ్‌ను తనిఖీ చేశారు. వారి వద్ద 1,030గ్రాముల గంజాయి పట్టుబడ్డట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గొర్ల మందపై అడవి జంతువుల దాడి

30 మృతి, 12 గొర్రెల పరిస్థితి విషమం

రూ. 4 లక్షల వరకు నష్టం



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాల క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం పాత మంచిర్యా ల మధురానగర్ సమీపంలోని పొనవేని రాజబాబు ఇంటి ఆవరణలో ఉన్న గొర్రెల మందపై గుర్తు తెలియని అడవి జంతువులు దాడికి పాల్పడ్డాయి. మొత్తం 43 గొర్రెలపై దాడి చే యగా 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో 13 గొర్రెల పరిస్థితి విషమంగా ఉంది. బా ధితుడు తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారుజామున గొర్రెలు ఒక్కసారిగా అ రవడంతో యజమాని ఇంటి నుంచి బయటకు వచ్చి చూసేసరికి గొర్రెలపై దాడి చేసినట్లు గుర్తించాడు. గొర్రెల వైపు చూసేసరికి ఏదో ఒక గుర్తు తెలియని క్రూర జంతువు గొర్రెలపై దాడి చేస్తూ కనిపించింది. గొర్రెలపై ఎన్ని జంతువులు దాడి చేశాయనే దానిపై స్పష్టత లేదు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

విచారణ చేపట్టాం..

గొర్రెల దాడికి సంబంధించిన విచారణ చేపట్టామని ఎఫ్ఎస్‌వో అన్నారు. గొర్రెలపై దాడి చేసింది వాటి పాదాల ఆధారంగా పశు వైద్యాధికారి ఇచ్చిన రిపోర్టు ప్రకారం వైల్డ్ డాగ్ (అడవి కుక్కలు) దాడి చేసి ఉంటాయని, ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉందన్నారు. రెవెన్యూ అధికారి, ఆర్ఐ స్వప్న సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధివవతుడికి నష్టపరిహారం చెల్లించేందుకు ప్రయత్నిస్తామన్నారు. గొర్రెల మందపై దాడి చేసిన ఘటన ను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్, పట్టణ మహిళా అధ్యక్షురాలు పెంట రజితతో పాటు వార్డు సభ్యులు పరిశీలించారు. బీఆర్ఎస్ మాజీ చైర్మన్ పెంట రాజయ్యతో పాటు బీఆర్ఎస్ నాయకులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

వాహనాల తనిఖీ

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపారు. తీసుకుంటామన్నారు. వాహనదారులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు ఎప్పుడు?



బోరిగాం శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా చర్యలు కరువు
- ఇటీవల అధికారుల పరిశీలనతో చిగురిస్తున్న ఆశలు

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా అధికారులు కేటాయించక పోవడంతో నిరాశ చెందుతున్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చాలన్న ప్రభుత్వం ఆశయం ఇందిరమ్మ ఇళ్ల వేగవంతంతో నెరవేరుతుండగా, గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ పంపిణీలో తాత్సారం చేసింది. వాటిని కూడా పేద వారికి పంపిణీ చేసేందుకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కాగజ్‌నగర్ బోరిగాం శివారంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాలను ఇప్పటికే పలుమార్లు కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు.

ఇటీవల డబుల్ బెడ్ రూం ఇళ్లను కలెక్టర్, వెంకటేశ్ దోత్రే, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషారావు, గృహ నిర్మాణ శాఖ డీఈఈ వేణుగోపాల్, ఆర్అండ్‌బీ, మున్సిపల్ శాఖాధికారులు పరిశీలించారు. మూడేళ్ల క్రితం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఉపయోగంలోకి తేవడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లను గతంలోనే లక్కీడిప్ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేశారు. కాగజ్‌నగర్‌లో 288 (జీ+2) ఇళ్ల నిర్మాణం చేపట్టారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో దాదాపు అన్ని సౌకర్యాలు పూర్తి చేయాలని భావించారు. ఈలోగా ఎన్నికలు రావడంతో పట్టించుకోలేదు.

అర్హులకు ఇళ్లు కేటాయించాలి..

లెండుగురే శ్యాంరావు, బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి



డబుల్ బెడ్‌రూం ఇళ్లు అర్హులకు ఇళ్లు కేటాయించాలి. గతంలో లక్కీడిప్ ద్వారా పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏరాట్లు చేశారు.అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసినా అధికారులు కేటాయించక పోవడం తో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయం.

ఇళ్లకు దరఖాస్తులు అధికంగా రావడం, తక్కువగా ఉండడంతో ఎంపిక చేపడితే సమ్యలు వస్తాయని పంపిణీ కోసం లక్కీడిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి పక్కన పెట్టారు. ఎన్నికలు రావడంతో పంపిణీ నిలిచిపోయింది. ప్రస్తుతం ఎన్నికలు పూర్తయి రెండేళ్లు కావస్తున్నప్పటికీ ఇంకా డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించకపోవడంపై లబ్ధిదారులు పలు మార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనుల్లో రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, తదితర సౌకర్యాలు పూర్తి చేసి ప్రారంభం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో నిరుపేదలు సొంతింటి కళ నెరవేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగజ్ నగర్‌లో 488 మంజూరుకుగాను 288 నిర్మాణాలు చేపట్టారు. లబ్ధిదారుల ఎంపికను రెవెన్యూ అధికారులు పూర్తి చేసినప్పటికీ కూడా ఇంత వరకు ఇవ్వలేదు. డబుల్ బెడ్‌రూంలో గృహ సముదాయాల్లో రోడ్లు, భవనాలు, గృహ నిర్మాణ, విద్యుత్ శాఖల అధికారులు సందర్శించారు. ఇండ్లలో విద్యుత్ సరఫరా, కిటికీలు, తలుపులు, తాగునీరు, మురు గు కాలువలు, రోడ్లు, పనులు పూర్తి చేయడంతో పాటు ఇళ్ల మధ్యలో పెరిగిన ముళ్లపొదలను తొలగించి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించడంతో కదలిక వచ్చినట్లయింది. దీంతో ఇళ్లు అందుతాయని లబ్ధిదారులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పీ 3 గనిలో నెలకొన్న కార్మి కుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీ యూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు అన్నారు. పిట్ కార్యదర్శి ఆర్ గోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం బాయిబాట నిర్వహించారు. విశిష్ట అతిథులుగా సీనియర్ నాయకులు గరిగె స్వామి, ఏనుగు రవీందర్ రెడ్డి హాజరై కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఆర్ఓఆర్ వాటర్ ప్లాంటు పనిచేయకపోవడంతో 1400 మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మరో ఆర్ఓఆర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు టాయిలెట్లు హైజినిక్ కండీషన్‌లో నిర్వహించడం లేదని, వెంటనే డోర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్, వీరమల్లు, సహాయ పిట్ కార్యదర్శులు నరసింహారెడ్డి, వేణు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

లక్సెట్టిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జెండవెంకటాపూర్ గ్రామానికి చెందిన బండారి రామలక్ష్మి(95) అనే వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సురేష్ శుక్రవారం తెలిపాడు. ఎస్సై, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రామలక్ష్మి వయస్సు పైబడి ఇబ్బంది పడుతుందని తరచూ తనకు ఇంకా చావు రావడం లేదంటూ కుటుంబ సభ్యులతో చెబుతూ బాధపడేది. ఇంట్లో అందరూ పనిలో ఉండగా బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితా అందజేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీవో భిక్షపతి

ఆసిఫాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీసీ హాల్ నుంచి ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీవో భిక్షపతితో కలిసి శుక్రవారం జూమ్ మీటింగ్ ద్వారా తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, సబ్ ఇన్‌స్పెక్టర్లతో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై వీసీ ద్వారా ఆదేశాల జారీ చేశారని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించనున్నామని తెలిపారు. గొడవలు జరిగిన పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను తహసీల్దార్‌లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సబ్ ఇన్స్‌పెక్టర్ సంతకాలతో అందించాలని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, డెడికేషన్ కమిషన్ కేటాయించిన ప్రకారం సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టాలని అన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిబంధనల ప్రకారం ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 22వ తేదీలోగా ఓటరు జాబితాలోని అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించాలని సూచించారు. 23న తుది ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటించాలని తెలిపారు. పోలింగ నిర్వహణకు అవసరమైన పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎన్నికల కార్యాచరణ ఖరారు అయిన రోజు నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. సమాశంలో డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

బడి బయట ఉన్న పిల్లల గుర్తింపు

సిర్పూర్(యు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గిరిజన గ్రామాలకు చెందిన బడికి దూరంమైన ఆదివాసీ విద్యార్థులను సిర్పూర్(యు) ఎస్సై రామకృష్ణ గుర్తించి మర్లవాయి ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం చేర్పించారు. మండలంలోని షెట్టిహడ్పనూర్ గ్రామానికి చెందిన జుంగనాక శ్యాంరావు ఏడో తరగతి, భీమన్‌గూటకు చెందిన మడావి అనిల్ ఎనిమిదో తరగతి, షెట్టిహడ్పనూర్ చెందిన బాపురావును ఆరో తరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు పార్వతి

జైనూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల మైదానంలో ఇటీవల నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు పార్వతితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ పరిధిలోని ఆసిఫాబాద్, జైనూర్, కాగజ్‌నగర్, మంచిర్యాల జోన్ పరిధిలోని అండర్ 14-17 జట్టకు పోటీలు నిర్వహించారు. ఇందులో ఆశ్రమోన్నత పాఠశాల బాలికలు కబడ్డీలో లో ప్రథమ స్థానంలో నిలిచారని జైనూర్ ఆశ్రమ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు పార్వతి తెలిపారు. విద్యార్థినులు కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వెంకటరమణి, విద్యార్థినులు జ్యోతిక, లోకేశ్వరి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ సీఎండీ

శ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల, రక్షణ, వైద్య సేవల పెరుగులదకు వంటి అంశాలపై సింగరేణి సీఎండీ బలరాం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు "డయల్ యువర్ సీఎండీ" కార్యక్రమం నిర్వహించనున్నట్లు యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల కార్మికులు తమ సూచనలు, సలహాలను 040-23311338 ఫోన్ ద్వారా తెలుపవచ్చని కోరింది.

రూ. 21 వేల సీలింగ్ ఎత్తివేయాలి

శ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐలో 21 వేల సీలింగ్ ఎత్తివేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (ఎస్‌సీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీలో జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఎస్ఐ అమలు చేయడానికి కార్మికుల వేతనంపై రూ.21 వేల సీలింగ్ విధించిందన్నారు. ఫలితంగా రూ. 21 వేలు దాటి స్కిల్డ్ కార్మికులకు, సెక్యూరిటీ, కన్వేయన్స్ డ్రైవర్లు, సూపర్‌వైజర్లకు ఈఎస్ఐ అమలు కాకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనంలో బోనస్ కలుపడంతో కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు వైద్యం అందకుండా పోతుందని, యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్‌సీకేఎస్ బ్రాంచ్ కార్యదర్శి గట్టు మహేందర్, కన్వేయన్స్ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు కాసి పేట రాజేశం, సంపత్ రావు, నాయకులు సతీష్, రాజలింగు, విద్యాసాగర్, సురేష్, వినయ్, శ్రీనివాస్, శ్రీధర్, ప్రదీప్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం, మానసికోల్లాసం



క్రీడాజ్యోతితో పరుగులో పాల్గొన్న జీఎం రాధాక్రిష్ణ

మందమర్రిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆరోగ్యం, మానసికోల్లాసం సాధ్యమవుతుందని ఈ విషయాన్ని ప్రతి అధికారి దృష్టిలో పెట్టుకోవాలని మందమర్రి జీఎం రాధాక్రిష్ణ తెలిపారు. మందమర్రి ఏరియాలోని స్థానిక ఇల్లందు క్లబ్ సోక్లస్ట్ క్రీడలు 2025 ప్రారంభోత్సవానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సీఎండీ బల్‌రాం ఆదేశాల మేరకు క్రీడల నిర్వహణ జరుగుతుందని తెలిపారు. ఈఇక్లస్ట్ క్రీడల్లో లాన్ టెన్నిస్‌కూడ చేర్చారని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా 12 ఏరియాల నుంచి అధికారులు, వారి కుటుంబాలు క్రీడలకు హాజరుకావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రధానంగా ఈ క్రీడలు రెండు రోజులపాటు జరుగనున్నా 'పని తెలిపారు. షటిల్, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిడ్‌తో పాటు లాన్ టెన్నిస్ క్రీడలు కూడ చేర్చారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొంటున్నవారు గెలుపోటములు ఒకే విధంగా తీసుకొని క్రీడాస్ఫూర్తిని చాటాలని తెలిపారు. సింగరేణిలో క్రీడలకు యాజమాన్యం పెద్దపీట వేస్తుందని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు పతకాలు సాధించి సింగరేణి కీర్తిని కోలిండియా స్థాయిలో ఎగురవేయడంతో పాటు రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించేవారికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి మందమర్రి, రామకృష్ణాపూర్‌లో కోర్టులు మైదానాలు సిద్ధం చేశామన్నారు. అన్ని సౌకర్యాలు సమకూర్చామన్నారు. రెండు రోజుల పాటు ఈక్రీడలతో ఆహ్లాదకరవాతావరణం సంతరించుకొందని తెలిపారు. 23వ తేదీ బహుమతి ప్రదానోత్సవానికి సీఎండీ హాజరవుతున్నా రని తెలిపారు. అంతకుముందు అధికారులతో కలిసి క్రీడాజ్యోతిరన్‌లో పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వళన చేసి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజనల్ సేఫ్టీ జీఎం కె రఘుకుమార్, శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్, బెల్లంపల్లి జీఎం విజయభాస్కర్ రెడ్డి, ఎస్ఓటు జీఎం లలితాప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షులు రమేశ్, ఏజెంటు అబ్దుల్ ఖాదీర్, డీజీఎం పర్సనల్ అశోక్‌పాల్గొన్నారు.

నాయకుల నిర్బంధం సరికాదు



శ్రీరాంపూర్‌లో నిరసన తెలియజేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న యూనియన్ నాయకులను శాంతి భద్రతల పేరుతో అరెస్ట్ చేసి నిర్బంధించడం సరికాదని హెచ్ఎంఎస్ సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య అన్నారు. అరెస్టులను నిరసిస్తూ శ్రీరాంపూర్ ఏరియాలో అన్ని గనులు, విభాగాలపై నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడారు. గనులపై యూనియన్ సమావేశాలు పెట్టుకున్నా బెదిరింపు లెటర్లు ఇవ్వడం దారుణమన్నారు. గత జేసీసీ, స్ట్రక్చర్ సమావేశాల్లో చర్చించిన అంశాలను వెల్లడించలేదన్నారు. కానీ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు మాత్రం అన్నింటికి అంగీకారం తెలిపినట్లు ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. ఏఏ అంశాలపై అంగీకారం జరిగిందో అధికారికంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో హెచ్ఎం ఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు వి అనిల్‌రెడ్డి, కార్యదర్శి పొనగంటి అశోక్, పిట్ కార్యదర్శి శశిధర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తున్న హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్‌లను అక్రమంగా అరెస్టు చేయడంను నిరసిస్తూ శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని సీహెచ్‌పీలో హెచ్ఎంఎస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజమాబు, ఆరీఫ్, ఇనూస్, దీపక్ రాజ్, బాలేష్, దత్తు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



బొగ్గు నాణ్యతలో శ్రీరాంపూర్ ఏరియా మేటి



సీఎండీ నుంచి బహుమతిని అందుకుంటున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయడంతో శ్రీరాంపూర్ ఏరియాలో మేటిగా నిలుస్తోందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. క్వాలిటీ బొగ్గును ఉత్పత్తి చేసినందుకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి ఏరియాలోనే శ్రీరాంపూర్ మొదటి బహుమతి సాధించినందుకు సీఎండీ నుంచి అభినందనలు, బహుమతి అదుకున్న సందర్భంగా శుక్రవారం జీఎం కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. గతేడాది శ్రీరాంపూర్ ఏరియా 75శాతం క్వాలిటీతో మొదటి స్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఇందారం, శ్రీరాంపూర్ ఓసీపీల పీవోలు ఏవీ రెడ్డి, చిప్ప వెంకటేశ్వర్లు, ఏజెంట్లు శ్రీధర్, రవి కుమార్, సీహెచ్‌పీ ఎస్ఈ చంద్రలింగం, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, క్వాలిటీ ఇన్‌చార్జి మేనేజర్ కె. వెంకటేశ్వర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, సివిల్ ఇంజనీర్ సత్యనారాయణ, గ్రూప్ ఇంజనీర్ శ్రీనివాస భట్టాచార్య పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

శ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో ఉద్యోగుల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. ఏరియా స్టోర్స్‌లో అమ్మవారి ఆలయం ఎదుట, కార్యాలయం ఎదుట నూతనంగా నిర్మించిన షెడ్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఓ టు జీఎం రాజేందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) సుమలత, ఇందారం ఓసీపీ పీవో ఏవీ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

హైజంప్‌లో సిల్వర్ మెడల్

లక్సెట్టిపేట, నవంబరు, 21(ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే కళాశాలకు చెందిన పి.అఖిల్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్ సాధించాడు. ఇటీవల ఎస్‌జీఎఫ్‌ఐ-69వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న అఖిల్ హైజంప్ విభాగంలో ప్రతిభ కనబర్చడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా ఈనెల 26నుండి 30వ తారీకు వరకు హర్యానాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపల్ మంగ తెలిపారు.

బీటీ రోడ్డు వేయాలని వినతి

దండేపల్లి నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం కన్నెపల్లి చెందిన రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లే రహదారి బాగు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్న దృష్ట్యా అట్టి అంతర్గత రోడ్డుకు మరమ్మతు చేపట్టి బీటి రోడ్డు నిర్మించాలని కోరుతూ శుక్రవారం కన్నెపల్లి గ్రామ బీజేపీ కమిటీ నాయకులు ఎంపీడీవో, తహసీల్దార్‌లకు వినతిపత్రాన్ని అందజేశారు. కన్నెపల్లి నుంచి ఎల్లారం వెళ్లే పంటపొలాల రోడ్డు, కన్నెపల్లి నుంచి లక్సెట్టిపేట గురుకుల పాఠశాలకు వెళ్లే వ్యవసాయ రహదారులన్నీ పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు పోవడానికి, నడవడానికి కష్టంగా ఉందని రైతులు వాపోయారు. ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేసి వ్యవసాయ పొలాలకు బీటి రోడ్డులు నిర్మించేల చర్యలు చేపట్టాలని రైతులు, బీజేపీ గ్రామ కమిటీ నాయకులు వేర్వురుగా వినతిపత్రాలను సమర్పించారు.

జిల్లాస్థాయికి విద్యార్థులు ఎంపిక

చెన్నూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) :చెన్నూరులోని ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి చెకుముకిసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని సుద్దాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. లహస్మిత, అంజలి, నర్సయ్యలు ప్రథమస్దానంలో నిలువగా వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి



- గడివచిన పది నెలల్లో ఏడుగురు మృతి, 25 మందికి గాయాలు
- కనిపించని బారీకేడ్లు..
- వెలగని విద్యుత్ దీపాలు
- నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్న పోలీసులు

మందమర్రిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా గద్దెరాగడి నుంచి మందమర్రి టోల్ ప్లాజా వరకు జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. గడిచిన పది నెలల్లో ప్రమాదాలు జరిగి ఏడుగురు మృతిచెందగా 25 మందికి తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ రోడ్డుపై ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. ఈ రహదారిపై విద్యుత్ దీపాలు లేకపోవడం.. రహదారి మధ్యలో ఉన్న డివైడర్లకు బారీకేడ్లు లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది. అంతేకుండా వాహనదారులు త్వరగా గమ్యస్థానాలకు చేరాలని రాంగ్‌రూట్‌లో ప్ర యాణించడం ప్రమాదాలకు కారణమవుతుంది. ఈ రోడ్డుపై మేడారం వద్ద అండర్ పాస్ బ్రిడ్జి ఉంది.

అలాగే పట్టణంలోని బెల్లంపల్లి, మంచిర్యాల, మందమర్రి, గోదావరిఖని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఫ్లైవర్ ఓవర్ బ్రిడ్జి కింద నుంచి వెళ్లేందుకు దారి ఉంది. కొంత దూరంలో పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు మార్గం, జీఎం ఆఫీసు సమీపంలో వాహనాలు వెళ్లేందుకు రోడ్డు మార్గం ఉంది. బ్రిడ్జికి రెండు వైపులా సర్వీసు రోడ్లను నిర్మించారు. శ్రీనివాసగార్డెన్ నుంచి మొదలుకుని మందమర్రి వరకు డివైడర్లకు బారీకేడ్లు లేకపోవడంతో వాహనదారులు వెనకా ముందు చూసుకోకుండా వెళ్లడం, ఏదో వాహనం ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు.

● ప్రమాదాలు జరుగుతున్న తీరు...

మందమర్రి టోల్ గేట్ నుంచి గద్దెరా గడి శ్రీనివాసగార్డెన్ వరకు పది కిలో మీటర్ల జాతీయ రహదారి ఉంది. ఈ రోడ్డుకు రెండు వైపులా సర్వీసు రోడ్లు ఉన్నాయి. రోడ్డును ఆనుకుని క్యాతనపల్లి, మేడారం, ఎర్రగుంటపల్లి, ఊరు మందమర్రి, నార్లాపూర్, పులిమడుగు, బొక్కల గుట్ట గ్రామాలు ఉన్నాయి. ఈ రోడ్డుపై వాహన దారులు రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌లు ధరించకపోవడంతో కింద పడి తలకు గాయాలై మృత్యువాత పడుతున్నారు. రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాలకు వెళ్లాలంటే అండర్ పాస్ బ్రిడ్జీల గుండా దాటి అవతలి వైపు వెళ్లాలి. దీంతో రాంగ్ రూట్‌లో వస్తుండడంతో వాహనాలు ఢీకొని మృతి చెందుతున్నారు. జాతీయ రహదారిపై విద్యుత్ దీపాలు ఫ్లై ఓవర్ బ్రిడ్జీ వరకు మాత్రమే ఉండడం, ఆ తర్వాత కిలోమీటర్లమేర లైట్లు లేకపోవడంతో నడుచుకుంటూ రోడ్డుదాటుతున్న వారు ప్రమాదాల బారిన పడుతున్నారు.

మద్యం షాపులతో ప్రమాదాలు

జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ద్విచక్రవా హనదారులు, ఇతర వాహనదారులు మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మందమర్రి నుంచి గద్దెరాగడి వరకు దాదాపు 3 మద్యం దుకాణాలు ఉన్నాయి. బురద గూడెం సమీపంలోని జాతీయ రహదారి పక్క నే మద్యం షాపు ఉండగా క్యాతనపల్లి జాతీయ రహదారి పక్కన మరో మద్యం షాపు, కొంత దూరం తర్వాత గద్దెరాగడి వద్ద మరో మద్యం షాపు ఉంది. దీంతో కొందరు వాహనదారులు వాహనాలు ఆపి మద్యం దుకాణాలకు వెళ్లేందుకు రోడ్డు దాటుతూ ప్రమాదాలు జరిగి మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు. అలాగే డివైడర్లకు బారీకేడ్లు ఏర్పాటు చేస్తే రోడ్డు దాటరని దీంతో ప్రమాదాలను కొంత నివారించ వచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిబంధనలు పాటించాలి

శశిధర్‌రెడ్డి, మందమర్రి సీఐ



రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోవడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా త్వరగా వెళ్లాలని జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వెళ్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొనడంతో మృత్యువాత పడడంతో పాటు గాయాలపాలవుతున్నారు. ఇటీవల జరిగిన అధిక ప్రమాదాలు రాంగ్‌రూట్‌లో రావడం వల్ల జరిగినవే. రహదారి పక్కన ఉన్న మద్యం దుకాణాల వల్ల బాగా వెలుతురు వచ్చే లైట్లను ఏర్పాటు చేయాలని సూచించాం. జాతీయ రహదారిని నడుచుకుంటూ దాటి వెళ్లకూడదు. ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. ఇటీవల రాంగ్‌రూట్‌లో వెళ్తున్న 25 ద్విచక్రవాహనాలను సీజ్ చేశాం.

ప్రజా సంక్షేమం, భద్రతే పోలీసుల ధ్యేయం డీసీపీ భాస్కర్



దుప్పట్లు పంపిణీ చేస్తున్న డీసీపీ భాస్కర్, ఏసీపీ రవికుమార్

నెన్నెల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమంతో పాటు వారికి భద్రత కల్పించడంలో పోలీసులు ముందుంటారని డీసీపీ భాస్కర్ అన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని జంగాలపేటలో శుక్రవారం నిర్వహించిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, రూరల్ సీఐ హనోక్‌లతో కలిసి 200 మంది నిరుపేదలకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దుప్పట్ల కొనుగోలుకు ఆర్థిక సాయం చేసిన అమెరికాలో నివాసం ఉండే గుడిమల్ల మమతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెన్నెల, తాళ్లగురిజాల ఎస్సైలు ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

బాలుడి వైద్య ఖర్చుకు దాతల సాయం

దండేపల్లి నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన దొంతమల్ల మౌనిక-నరేష్ దంపతుల బాలుడి వైద్య ఖర్చుల కోసం దాతలు ముందుకొచ్చారు. బాలుడు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య ఖర్చులకు రూ. 10 లక్షల వరకు అవుతుందని వైద్యులు తెలపడంతో నిరుపేదలైన కన్న వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. విషయం తెలుసుకున్న హైదరాబాద్ నర్సాపూర్‌కు చెందిన యువకులు ముందుకు వచ్చి జోలె అనే కార్యక్రమం చేపట్టారు. ఇలా సుమారు రూ లక్షా 50వేలను జమ చేసి బాలుడి కుటుంబానికి అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో నర్సాపూర్ గ్రామానికి చెందిన యువ కులు గాండ్ల అశోక్‌కుమార్, సందీప్‌గౌడ్, సతీష్, తిరుపతి, ఎల్లాగౌడ్ పులిశెట్టి సాయి, ఆడపు పరమేష్, పాల్గొన్నారు.

నక్కలపల్లికి బస్సు సౌకర్యం ప్రారంభం

కోటపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కలపల్లి గ్రామానికి శుక్రవారం ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యాన్ని ప్రారం భిం చారు. వర్షాకాలంలో రోడ్డు తెగిపోయి గుంతలు కావడంతో ఈ గ్రామా నికి ఇంత కాలం బస్సు సౌకర్యం నిలిపివేయగా తాజాగా రోడ్డుకు మర మ్మ తులు జరగడంతో బస్సు సౌకర్యాన్ని పునరుద్దరించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బస్సుకు పూలమాలలు, తోరణాలు కట్టి స్వాగతం పలికారు. ఎట్టకేలకు తమకు బస్సు సౌకర్యం కల్పించిన ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎట్టకేలకు కదలిక...

(5వ పేజీ తరువాయి)

రైస్ మిల్లు ఏర్పాటు చేసిన గిరిజన భూములను కాపాడాలని కోరుతూ ఐటీడీఏ డైరెక్టర్ మర్సుకోల బాపురావు స్థానికులతో కలిసి ఉట్నూరులోని అప్పటి ప్రాజెక్టు ఆఫీసర్ ఖుష్బూ గుప్తాకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్‌ను సర్వే జరిపించాలని పీవో ఆదేశాలిచ్చారు.

పీవో ఆదేశాలూ బేఖాతర్...!

వ్యాపారి కబ్జా చేసిన రెండు సర్వే నంబర్‌లో 18కి సంబంధించి 30 గుంటల స్థలం కబ్జాకు గురైందని విచారణ జరిపించిన తహసీలార్ ఆ మేరకు ఉట్నూరు ట్రైబల్ వెల్ఫేర్ ఎస్‌డీసీకి లేఖ రాశారు. ఇంత వరకు బాగానే ఉన్నా... సర్వే నంబర్ 17లోని 10 గుంటల భూమి వెనక్కి తీసుకోవాలన్న ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆదేశాలను మాత్రం అధికారులు ఖాతరు చేయకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. సర్వే నంబర్ 17లోని 10 గుంటల భూమిని సదరు వ్యాపారి కబ్జా చేయడం వాస్తవమేనని తేలడంతో అప్పటి ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఈ ఏడాది ఫిబ్రవరి 6న, ట్రైబల్ వెలేర్ ఎస్డీసీ జూన్ 28న సదరు భూమిని వెనక్కి తీసుకోవాలంటూ దండేపల్లి తహసీల్దార్‌కు లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. దాదాపు ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇటు రెవెన్యూ అధికారులు, అటు పోలీస్ శాఖ మధ్య సమన్వయ లోపం కారణంగా భూమిని స్వాధీనం చేసుకొనే అంశం కాస్త మరుగున పడింది.

నిలిచిన ఇళ్ల నిర్మాణం....

ముత్యంపేట శివారు సర్వే నంబర్ 17లో ఉన్న మొత్తం 34 గుంటలను 2005లో ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు తహసీల్దార్ గ్రామంలోని 12 మంది గిరిజనులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించారు.

కాల క్రమంలో భూమి కబ్జాకు గురి కావడంతో గిరిజనులు ఇళ్లు నిర్మించుకోలే ని పరిస్థితి దాపురించింది. 'ఆంధ్రజ్యోతి' కథనం తో విచారణ జరిపిన రెవెన్యూ అధికారులు భూమి కబ్జాకు గురైందని తేలినప్పటికీ స్వాధీనం చేసుకోవడంలో మాత్రం జాప్యం చేశారు. ఈ విషయంలో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు అప్పటి ఐటీడీఏ పీవో సైతం భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు స్వాధీనం చేసుకోకపోవడంతో గిరిజనులకు ఇళ్లు నిర్మించుకొనే భాగ్యం కలగడం లేదు. ఇప్పటికైనా భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుం టారా...? లేదా..? అన్న విషయమై వేచి చూడాల్సిందే.

ఆశ్రమ పాఠశాల సీఆర్‌టీలను రెగ్యులరైజ్ చేయాలి

కోటపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆశ్రమ పాఠశాలల్లోని సీఆర్‌టీలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఈ పాఠశాలల పండిత్, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించి ప్రమోషన్‌లు కల్పించాలని టీపీటీ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్య లను పరిష్కరించాలని కోరుతూ కోటపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల ముందు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగరావు, సంఘం జిల్లా అధ్యక్షుడు సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలను బహిష్కరించిన విద్యార్థులు



వెలవెలబోతున్న సోమగూడెం పాఠశాల

కాసిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సోమగూడెం లంబాడితండా ఎంపీపీ పాఠశాల నుంచి ఇటీవల ఉపాధ్యాయురాలు ప్రవళికను డిప్యూటేషన్‌పై కాసిపేటకు పంపడాన్ని నిరసిస్తూ గత మూడు రోజులుగా విద్యార్థులు పాఠశాలను బహిష్కరించి ఇళ్లకే పరిమితం అయ్యారు. దీంతో మూడు రోజుల నుంచి తరగతి గదుల్లో విద్యార్థులు లేక వెలవెలబోతుంది. 60 మందికి పైగా విద్యార్థులున్న సోమగూడెం పాఠశాలలో కొంత మంది బడికి హాజరు కావడం లేదు. దీంతో అధికారులు ఇక్కడున్న ఉపాధ్యాయురాలు ప్రవళికను డిప్యూటేషన్‌పై పంపడంతో తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. ఐదు తరగతులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా ఇందులో నుంచి ఒక ఉపాధ్యాయురాలును డిప్యూటేషన్‌పై పంపడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటేషన్ వెళ్లిన ఉపాధ్యాయు రాలును తిరిగి తీసుకువచ్చేంత వరకు నిరసనలు ఇలాగే కొనసాగిస్తామని తల్లిదండ్రులు చెబుతుండడం విశేషం.

సామూహిక వందేమాతర గీతాలాపన



సామూహిక వందేమాతరం చేస్తున్న బీజేపీ నాయకులు, ప్రజలు

బెల్లంపల్లి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం బీజేపీ పట్టణ అధ్యక్షురాలు దారా కళ్యాణి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు వ్యాపారస్తులు ప్రజలతో కలిసి సామూహిక వందేమాతర గీతాలాపన చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్లు గౌడ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏమాజి, పాల్గొన్నారు.

లక్సెట్టిపేట : దేశ ప్రజలందరిని ఏకదాటికి తీసుకువచ్చిన గీతం వందేమాతరం గీతం అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. శుక్రవారం లక్సెట్టిపేట పట్టణంలోని గాంధీ చౌక్‌లో విద్యార్థులతో కలిసి వందేమాతర గీతాలాపన చేపట్టారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు హరిగోపాల్‌రావు, మండల అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చెన్నూరు : మండలంలోని సుద్దాల గ్రామంలో శుక్రవారం సామూహిక వందేమాతర గీతాన్ని ఆలపించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కోటపల్లి : మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సామూహిక వందేమాతర గీతాన్ని ఆలపించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : ఆదిల్‌పేట గ్రామ చౌరస్తాలో బీజేపీ నాయకులు, విద్యార్థులు సామూహిక గీతాలాపన చేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అద్దె కారు విషయమై ఒకరిపై దాడి కేసు నమోదు

శ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అద్దె కారు విషయంలో ఒకరిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన సంఘటన శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా జరిగింది. ఎస్ఐ సంతోష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీరాంపూర్‌లోని అరుణక్క నగర్‌కు చెందిన రాకేష్‌రెడ్డి తన కారును అద్దెకు తిప్పుతున్నాడు. ఈ కారును కన్నెపల్లి మండలం ముత్తాపూర్‌కు చెందిన సుంకరి తిరుపతి అద్దెకు తీసుకున్నాడు. దానికి మరమ్మతు కావడంతో 60 వేల రూపాయలు ఇవ్వాలని యజమాని అయిన రాకేష్‌రెడ్డి సుంకరి తిరుపతిని కోరుతున్నాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై రాకేష్ రెడ్డితో మాట్లాడుకునేందుకు సుంకరి తిరుపతి, సుంకరి కిరణ్ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్ ఎదుట మాట్లాడుకుంటుండగా మాటా, మాట పెరిగి రాకేష్‌రెడ్డిపై ఇద్దరు దాడి చేశారు. దీంతో పోలీసు సిబ్బంది పరుగుపరుగున వచ్చి ఇరువర్గాలను నిలువరించారు. రాకేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు తిరుపతి, కిరణ్‌లపై కేసు నమోదు చేశారు. గొడవ సమయంలో మద్యం తాగి ఉన్నందున సుంకరి తిరుపతిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు కూడా నమోదు చేసినట్లు ఎస్ఐ సంతోష్ పేర్కొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాన్ని విజయవం తంగా అమలు చేసి ఉత్తమ అవార్డు అందుకున్న సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఘనంగా సన్మానించారు. జిల్లా పౌరసంబంధాల అధికారి కృష్ణమూర్తి, తెలంగాణ సంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షుడు సురేందర్, పాల్గొన్నారు.

మత్స్యకారుల దినోత్సవం

మంచిర్యాల కలెక్టరేట్: ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో ముదిరాజ్ సంఘం నాయకులు నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరుపతి, జిల్లా అధ్యక్షుడు కొమురయ్యలు జెండాను ఆవిష్కరించారు. ముదిరాజ్ ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. నాయకులు సతీష్, రాజేష్, నర్సయ్య, చందు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ

కోటపల్లి: ఈ నెల 23న జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్) పరీక్షకు సంబంధించి శుక్రవారం మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులకు ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ రాము, ఉపాధ్యాయులు హాల్‌టికెట్లు పంపిణీ చేశారు.

వృద్ధురాలిని చేరదీసిన ఎస్సై

హాజీపూర్ : మతి స్థిమితం కోల్పోయి రోడ్డుపై వాహనాలకు అడ్డుగా వెళ్తున్న వృద్ధురాలును హాజీపూర్ ఎస్సై స్వరూప్ రాజ్ చేరదీశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కల్వరి యువశక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ, ఆశ్రమంలో చేర్పించారు.

సంక్షిప్త సమాచారం

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి : దండేపల్లిలో ఈనెల 23 నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కిరణ్‌కుమార్, ఇరుకుల్ల శివ, ప్రోగ్రామ్ చైర్మపర్సన్ గాదె సత్యం కోరారు. శుక్రవారం దండేపల్లిలో ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంచిర్యాల లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ పురస్కరించుకుని సన్‌రైజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పోస్టర్లు విడుదల

లక్సెట్టిపేట: పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తాలో పీడీఎస్‌యూ మహాసభల పోస్టర్లను ఆ సంఘం నాయకులు శుక్రవారం విడుదల చేసారు. పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ మాట్లాడుతూ ఈనెల 26, 27వ తేదీన జిల్లా కేంద్రంలోని మార్క్ భవన్‌లో 20వ మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు.

కంప్యూటర్ విద్యను అందించడమే లక్ష్యం

లక్సెట్టిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించడమే లక్ష్యం అని సేవా భారతి సభ్యుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. శుక్రవారం లక్సెట్టిపేటలోని ప్రభుత్వ బాలుర పాఠశాల, మండలంలోని జెండవెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం కంప్యూటర్, టీవీలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రిలో చిన్నారి మృతి

మంచిర్యాల క్రైం: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేరు పల్లి మండలానికి చెందిన చిన్నారి సాహితి(5) శుక్రవారం మృతి చెందింది. అయితే చిన్నారి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరేష్‌కుమార్ అక్కడకు చేరుకుని వారితో మాట్లాడారు. ఫిర్యాదు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయమై సంబంధిత వైద్యుడిని వివరణ కోరగా వైద్యం అందించడంలో తమ నిర్లక్ష్యం లేదన్నారు. ఏసీపీ ప్రకాష్ అక్కడకు చేరుకుని బంధువులతో మాట్లాడారు.

టీడబ్ల్యూటీఏస్ పెద్దనపల్లి హెచ్ఎం సస్పెన్షన్

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి నాయకపుగూడ ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సోయం కృష్ణారావును సస్పెండ్ చేస్తున్నట్లు మల్కేపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సీహెచ్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గత కొంత కాలంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పాఠశాలకు సమయ పాలన పాటించకుండా ఇష్టం వచ్చినట్లు రావడం పట్ల ఇది వరకే అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఉట్నూరు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఈ నెల 17న సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 18న కృష్ణారావుకు సస్పెన్షన్ ఉత్తర్వులను అందజేశామన్నారు. గతంలో కూడా రెండు నెలలు సస్పెన్షన్‌కు గురయ్యాడని, అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాక పోవడంతో సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

లక్సెట్టిపేట, నవంబరు, 21(ఆంధ్రజ్యోతి): ఏఉద్యోగికైనా ప్రజలకు చేసే సేవలతోనే మంచి గుర్తింపు వస్తుందని మంచిర్యాల జిల్లా విద్యుత్ శాఖ సూపరిండెంట్ జాడె ఉత్తం అన్నారు. శుక్రవారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఇటీవల ఉత్తమ ఉద్యోగులుగా గుర్తింపు పొందిన విద్యుత్ శాఖ ఏడీఈ ప్రభాకర్‌రావు, ఏఈ గణేష్‌లు ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక కావడంతో వాళ్లను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్క ఉద్యోగి వీళ్లను ఆదర్శంగా తీసుకుని విధులు చేపట్టాలన్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉద్యోగులుగా మన ప్రాంతం నుండి ఎంపిక కావడం చాలా గొప్పతనం అని శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీఈ కైసర్, ఎస్ఏవో రాజేశం, ఏఏవో సుధాకర్, జన్నారం, దండేపల్లి ఏఈలు లచ్చన్న, బాపులతో పాటు డివిజన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సింగరేణిలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు విఫలం

మందమర్రిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీలు దారుణంగా విఫలమయ్యాయని ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు పార్వతి రాజరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక హెచ్ఎంఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో రానున్న రోజుల్లో ఉపాధి అవకాశాలు కనుమరుగయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఇప్పటికే ఉద్యోగులు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. రానున్న రోజుల్లో గనులు మూతపడే అవకాశాలున్నాయన్నారు. ఉద్యోగుల సొంతింటి కల ఇంత వరకు నెరవేరలేదన్నారు. పెరిక్స్‌పై ఇన్‌కం ట్యాక్స్ యాజమాన్యమే చెల్లించాలని చెప్పిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఇది అమలు చేయించడంలో విఫలమయ్యాయన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు గెలిచిన తర్వాత మర్చిపోయారన్నారు. 150 మస్టర్ల సర్క్యూలర్‌తో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం తమ యూనియన్ కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివార్‌రెడ్డి, రామస్వామి,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్


మందమర్రిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు కీడ్రల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుం దని కార్మెల్ కళాశాల ప్రిన్సిపాల్ జేవీయారెక్స్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కార్మెల్ పాఠశాలలో అండర్-19 ఎస్‌జీఎఫ్ జూనియర్ కళాశాల స్థాయి బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థి క్రీడాకారులకు కరచాలనం అందించి పరిచయం చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో పోటీలు నిర్వ హించడం తమ కళాశాల విద్యార్థులకు స్ఫూర్తిని ఇస్తుందన్నారు. బాస్కెట్‌బాల్ ద్వారా స్పీడ్ ఇండోరెన్స్ పెరుగుతుందని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములు ఒకే విధంగా తీసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఆదిలాబాద్ ఎస్‌జీఎఫ్ అండర్19 క్రీడల సెక్రెటరీ బాబురావు, వ్యాయమ ఉపాధ్యాయులు అమర్, పీడీ సతీష్, ఏ. వామన్, సుదీప్, రాజేందర్‌లు పాల్గొన్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

చెన్నూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) :చెన్నూరు మున్సిపాలిటీలో ఉన్న తన ఇంటి పేరు మార్పు కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రిటైర్డు తహసీల్దార్ నియాజోద్దీన్ ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ ఇంటి పన్ను చెల్లించేందుకు పేరు మార్పు చేయాలని వేడుకుంటున్నా మున్సిపల్ కమీషనర్ మురళీ కృష్ణ పెడచెవిన పెడుతున్నాడన్నారు.

మామూళ్లు ఇస్తేనే పనులు అవుతాయని పరోక్షంగా మున్సిపల్ కమీషనర్ అడిగాడని పేర్కొన్నారు. ఉన్నత స్థానంలో ఉద్యోగం చేసి రిటైర్ అయిన తనకే ఇన్ని ఇబ్బందులు ఉంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని అస హనం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో పని పూర్తి చేయకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తానని హెచ్చరించారు.



హాస్టళ్లలో దుప్పట్లు పంపిణీ చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చలికాలం దృష్ట్యా సాంఘీక సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు దుప్పట్లు అందజేయాలని, వేడి నీటి కోసం వాటర్ హీటర్ ఏర్పాటు చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాలలోని తోళ్లవాగు వెనకబడిన తరగతుల బాలుర కళాశాల వసతి గృహం ముందు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటేష్, శివతేజ, అనిల్, రాజేష్, సాయిరాం, అంజన్న, ఆదిత్య, శరత్, జశ్వంత్ పాల్గొన్నారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

మందమర్రిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రామకృష్ణపూర్ పట్టణంలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వంటలను తయారు చేసుకువచ్చారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వంటలను ప్రదర్శించారు. హైద్రాబాద్ బిర్యానీ, కేక్, చికెన్ కబాబ్, ఇతర వంటకాలను ప్రదర్శించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ఐ బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు కాసిపేట గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ తెలిపారు. రామకృష్ణాపూర్‌లో జరిగిన అండర్-14 బాస్కెట్‌బాల్ పోటీలలో గురుకుల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు వికాస్ యాదవ్‌తో పాటు జశ్వంతులు ఎంపికయ్యారన్నారు. పీడీ హరీశ్, పీఈటీ రాజేందర్‌లు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీకి ఎంపిక

దండేపల్లి నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం రెబ్బనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి చెందిన సీహెచ్ సాయి వర్షిత్ రాష్ట్రస్థాయి అండర్ 14 విభాగంలో ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీకి ఎంపికైయ్యారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి అండర్ 14 బాలుర విభాగంలో వాలీబాల్ ఎంపిక పోటీలు జరిగాయి. ఈపోటీలో రెబ్బనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా ధర్మారంలో ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగే రాష్ట్రస్థాయి అండర్ 14 బాలబాలికల ఛాంపియన్‌షిప్‌లో సాయి వర్షిత్ విద్యార్థి పాల్గొంటాడని పాఠశాల హెచ్ఎం, మండల ఇన్‌చార్జి విద్యాధికారి మంత్రి రాజు, పీడీ శ్రీనివాస్ తెలిపారు.

అధికారులకు క్వార్టర్ల కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్వార్టర్ల కేటాయింపునకు అధికారులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏడుగురు అధికారులు వారి సీనియారిటీ ప్రకారం క్వార్టర్లను ఎంచుకున్నారు. ఇన్‌చార్జి ఎస్ఓటు జీఎం రాజేందర్, ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, డీజీ ఎం(పర్సనల్) అనిల్ కుమార్, ఇన్‌చార్జి డీజీఎం(సివిల్) సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎట్టకేలకు కదలిక..

- అక్రమ రైస్ మిల్లుపై సర్వే రిపోర్ట్ సమర్పణ
- ఐటీడీఏ ఎస్‌డీసీకి లేఖ రాసిన దండేపల్లి తహసీల్దార్
- లేఖ సారాంశం ప్రకారం భూమి కబ్జా వాస్తవమే
- ఇప్పటికైనా అక్రమాల డొంక కదిలేనా...?
- అక్షర సత్యమైన 'ఆంధ్రజ్యోతి' కథనం


కబ్జాకు గురైన భూమిలో సర్వే జరుపుతున్న రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

మంచిర్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన (ఏజెన్సీ) భూములను కబ్జా చేయడమే గాకుండా, అందులో అక్రమంగా ఏర్పాటు చేసిన రైస్ మిల్లుపై ఎట్టకేలకు రెవెన్యూ అధికారుల్లో కదలిక వచ్చింది. మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు ఆదేశాల మేరకు దండేపల్లి తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే తన సిబ్బందితో విచారణ జరిపించి, ఉట్నూరులోని ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు ఈ నెల 17న సమగ్ర లేఖ రాశారు. లేఖలో మండలంలోని ముత్యంపేట శివారు సర్వే నంబర్ 18లోని భూమిని స్థానిక వ్యాపారి ముద్దసాని వేణుగోపాల్ అక్రమంగా చేజిక్కించుకొని రైస్‌మిల్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ లేఖతో గిరిజన భూమి అన్యాక్రాంతం విషయమై 'ఆంధ్రజ్యోతి'లో 12 నవంబరు 2024న 'ఏజెన్సీ భూమి కబ్జా' శీర్షికన ప్రచురితమైన కథనం అక్షర సత్యమని తేలింది.

ఏడాదిగా కొనసాగిన విచారణ..

ఏజెన్సీ భూమి కబ్జా జరిగిన విషయం వెలుగులోకి వచ్చిన తరువాత సంబంధిత అధికారులు కేవలం ఉత్తర ప్రత్యుత్తరాలకే పరిమితం అయ్యారు. అలా ఏడా దిపాటు తమ విచారణను కొనసాగిస్తూ వచ్చారు. ఇదే అంశంపై 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు కథనాలు రాయడం తో రెవెన్యూ సిబ్బందితో గతంలో ఒక మారు సర్వే జరిపించిన తహసీల్దార్ భూమి కబ్జా జరిగిందని ఐటీడీఏ అప్పటి ప్రాజెక్టు ఆఫీసర్ ఖుష్బూ గుప్తాకు లేఖ రాశారు. దీంతో భూమిని స్వాధీనం చేసుకోవాలని పీవో ఆదేశాలు జారీ చేసినప్పటికీ అప్పటి రెవెన్యూ అధికారులు కాలయాపన చేశారు. ఎట్టకేలకు ప్రస్తుత తహసీల్దార్ సర్వే రిపోర్టును ఉట్నూర్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ ఎస్‌డీసీకి అంద జేయడం గమనార్హం.

కలెక్టర్‌కు ఫిర్యాదుతో వెలుగులోకి...

గిరిజనుల భూములను గిరిజనేతరుడు కబ్జా చేసిన విషయమై పలువురు గ్రామస్థులు గతేడాది అక్టోబరు 28న కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో ఈ విషయమై కలెక్టర్ సూచనల మేరకు జిల్లా అప్పటి అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ నవంబరు 26 న అక్రమంగా రైస్ మిల్లు ఏర్పాటు చేసిన స్థలంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని దండేపల్లి తహసీల్దార్‌ను ఆదేశించారు. అయితే కలెక్టర్ ఆదేశాలను ఖాతరు చేయని మండల అధికారులు కబ్జాకు గురైన స్థలంలో ఎటువంటి విచారణ జరుపలేదు. దీంతో గిరిజనులు ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేశారు. ముత్యం పేట గ్రామం ఏజెన్సీ ఏరియా కావడంతో..

(తరువాయి 7లో)



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

వయోవృద్ధుల సంక్షేమ చట్టంపై అవగాహన ఉండాలి

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వయోవృద్ధుల సంక్షేమ చట్టంపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ కార్యాలయంలో వయోవృద్ధులను ఘనంగా శాలువా లతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వయోవృద్ధులకు సంబంధించి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. వారి పోషణ, సంక్షేమంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఫిర్యాదు దారులకు రక్షణ కల్పించడానికి ఎవరు లేని పక్షంలో ఓ ల్డ్ఏజ్ హోమ్స్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సంరక్షిస్తామన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ వయోవృద్ధుల సంరక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే డబ్బులను ఆర్థిక క్రమ శిక్షణ పాటిస్తూ ఖర్చు చేయాలన్నారు. తల్లిదండ్రులను ఇబ్బందులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంస్కృతిక సారధి కళాకారులు కలెక్టర్‌పై ప్రత్యేక పాట పాడి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, డీఈవో యాదయ్య పాల్గొన్నారు.


వయోవృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, సీపీ అంబర్ కిశోర్ ఝా

విద్యారంగ సమస్యల పరిష్కారంలో..

ప్రభుత్వం విఫలం

జైపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ జిల్లా ఇన్‌చార్జ్ బ్రహ్మానందం, అధ్యక్షుడు రెడ్డి చరణ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ చెన్నూరు ఏరియా మహాసభల కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ఉదయం గ్రామీణ ప్రాంతాల నుంచి సాయంత్రం వరకు కళాశాలల్లో ఉన్నప్పటికి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం మధ్యాహ్నం భోజనం పెడతామని కమిటీలు వేస్తామని చెప్పి మాటలకే పరిమితమితమైందన్నారు. ప్రభుత్వం వెంటనే కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సికిందర్, మనోహర్, సందీప్, రాహుల్, అవినాష్‌లు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి

బీజేపీ నాయకుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, బాధితులు

బెల్లంపల్లి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శిశుమందిర్ రోడ్డు విస్తరణలో భాగంగా ఉపాధి కోల్పోయిన వ్యాపారులకు నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ నాయకులు బాధితులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే, మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి మాట్లాడుతూ ఎక్కడ లేని విధంగా బెల్లంపల్లిలో 60ఫీట్లు, వంద ఫీట్ల రోడ్లను ఏర్పాటు చేస్తూ వీధి వ్యాపారులను, నిరుపేదలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. రోడ్డు వెడల్పులో ఉపాధి కోల్పోతున్న వ్యాపారులకు ఇండ్లు కోల్పోతున్న నిరుపేదలకు ప్రభుత్వ పరంగా సాయం చేయాలన్నారు. సమస్యలు పట్టించుకోకుండా స్థానిక ఎమ్మెల్యే హైదరాబాద్‌కే పరిమితమవడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే లేకపోవడంతో క్యాంప్ కార్యాలయం గేటుకు వినతిపత్రం అందించాల్సిన దుస్థితి ఏర్పడ్డదన్నారు. శిశుమందిర్ రోడ్డు విస్తరణలో 60ఫీట్ల నుంచి 40తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే చిరువ్యాపారులకు ఉపాధి కల్పించాలని, ఇండ్లు పోగొట్టుకున్న వారికి డబుల్‌బెడ్ రూం ఇండ్లు కేటాయించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్, నాయకులు పులగం తిరుపతి, గోవర్ధన్, శనిగారపు శ్రావణ్, నవీన్ కుమార్, రామ్మోహన్, సంతోష్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ

లక్సెట్టిపేట, నవంబరు, 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యకార కమిటీలకు ప్రభుత్వం అందజేస్తున్న చేప పిల్లలను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేసారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ అన్ని రకాల కుల సంఘాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. మన మండలానికి ప్రభుత్వం 29చెరువులకు గాను 9లక్షల పైచిలుకు చేప పిల్లలను అందజేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి.ఆరీఫ్, మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, ఆర్టీఏ మెంబర్ శ్రీనివాస్, ఫ్లోర్ లీడర్ నాగభూషణం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుమన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

రిలే దీక్షకు అనుమతివ్వండి..

జైపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో అధికారుల సమస్యలను, పీఆర్‌సీ బకాయిలను చెల్లించాలని కోరుతూ సీఎంవోఏఐ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష కోసం అనుమతి కోరుతూ సీఎంవోఏఐ అధ్యక్షుడు పంతుల శుక్రవారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, సీఐ నవీన్‌లకు వినతి పత్రం అందించారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు రావాల్సిన పీఆర్‌సీ బకాయిలను చెల్లించాలని యాజమాన్యంకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. ఈ నెల 26 వరకు స్పష్టమైన వెలువడకపోతే ఈ నెల 30 వరకు రిలే దీక్షలు చేపడతామని ఏసీపీకి తెలిపామన్నారు. నాయకులు సంతోష్‌కుమార్, జనగామ శ్రీనివాస్, రమేష్, శ్యామల పాల్గొన్నారు.

కార్మికులు, కూలీల సమస్యలను పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల, కూలీల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కూలీలు, పేదలు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ పనుల్లో యంత్రాలు వచ్చిన తర్వాత కార్మికులకు చేతి నిండా పని దొరకడం లేదన్నారు. యాజమనులు కూలీ రేట్లు పెంచకుండా దోచుకుంటున్నారన్నారు. మున్సిపాలిటీల్లో ఉపాధి పనులను చేపట్టాలని, వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. త్వరలో కూలీలు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగేష్, సరిత, సత్తక్క, బాపు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి స్వయం ఉపాధి పొందేలా అవకాశాలు కల్పిస్తున్నామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పరిశీలించారు. ఎంపీ మాట్లడుతూ ఈ సెంటర్ల ద్వారా వివిధ ట్రేడ్‌లలో నిరుద్యోగ యువతకు వృత్తి విద్య శిక్షణ అందించి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు.

శిక్షణ పూర్తయిన అనంతరం అప్రెంటీస్ సమయంలో దాదాపు నెలకు రూ. 12 వేల వరకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపల్ రమేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం

జన్నారం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని శుక్రవారం మండల అధ్యక్షులు దండవేణి శ్రీధర్ ఆధ్వర్యంలో ముదిరాజ్‌లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య కారులు వృత్తితో మత్స్యకార పథకాలు, రిజర్వేషన్‌లను ప్రభుత్వం ద్వారా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ముది రాజ్ గౌరవ అధ్యక్షులు దండవేణి చంద్రమౌళి, మండల సలహాదారు ఐల వేణి నరసయ్య, ముదేళ్ల అరుణ్, గుర్రపు నారాయణ, అట్టెం రవి, గణేష్, రవి, పాల్గొన్నారు.

ఘనంగా డీసీసీ అధ్యక్షురాలి జన్మదిన వేడుకలు


మంచిర్యాలలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

మంచిర్యాల క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మంచిర్యాల పట్టణ మహిళా అధ్యక్షురాలు పెంట రజీత ఆధ్వర్యంలో వేడుకలను నిర్వ హించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. తాజా మాజీ నాయకులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: కాంగ్రెస్ నాయకులు స్థానిక ఐబీలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి.ఆరీఫ్, మండల అధ్యక్షుడు రమేష్, ఆర్టీఏ మెంబర్ శ్రీనివాస్, ఫ్లోర్ లీడర్ నాగభూషణం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుమన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, పాల్గొన్నారు.

దండేపల్లి: స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకు సమీపంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలతో కలిసి కేక్ కట్ చేసి సురేఖ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానికులు, మహిళలు తదితరులు పాలొన్నారు.

మందమర్రిటౌన్: కొక్కిరాల సురేఖ ప్రేంసాగర్‌రావు జన్మదిన వేడుకలను పట్టణంలో కాంగ్రెస్ పార్టీ దాని అ నుబంధ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. మొదట కాంగ్రెస్ పార్టీ జిల్లా పీసీసీ సభ్యులు నూకల రమేశ్ కేకును కట్ చేసి కార్యకర్తలకు తి నిపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ ముజాహిద్, మార్కెట్ కమి టీ డైరెక్టర్ సిద్దం జనార్ధన్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే లక్ష్యం

రఘునాథ్ వెర్రబెల్లి

హాజీపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించడమే లక్ష్యమని బీజేపీ నాయకులు వెర్రబెల్లి రఘునాథ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించాలనే లక్ష్యంతో శుక్రవారం హాజీపూర్ ఉన్నత పాఠశాలలో సేవా భారతి ఆధ్వర్యంలో 5 లాప్ టాప్‌లు, ఎల్ఈడీ స్క్రీన్, ఇంటర్నెట్ కనెక్షన్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించాలనే లక్ష్యం తో పాఠశాలల్లో డిజిటల్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. జిల్లాలోని మొత్తం 12 పాఠశాలల్లో సేవా భారతి ఆద్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ విద్య అం దిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలతో మరింత పారదర్శకత

కోటపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించడం ద్వారా మరింత పారదర్శకత పెరుగుతుందని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. మండలంలోని నిర్వహించిన ఉపాధి హామీపనులకు సంబంధించిన ఇటీవల సామాజిక తనిఖీ బృందాలు గ్రామసభలు నిర్వహించి పనులపై పరిశీలన జరిపాయి. మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీలకు సంబంధించి శుక్రవారం ప్రజావేదికను నిర్వహించారు. డీఆర్‌డీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ఇటు కూలీలకు పనులతో పాటు అటు గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రజావేదికలో బయట పడిన అక్రమాలపై నిధులను రికవరీ చేస్తామన్నారు. అనంతరం అయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు చేపట్టిన పనులపై ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సామాజిక తనిఖీ బృందాల సభ్యులు వారు చేసిన తనిఖీలకు సంబంధించిన నివేదికలను చదివారు. శెట్‌పల్లిలో రూ. 4371, కోటపల్లిలో రూ. 1060, దేవులవాడలో రూ. 2154, బబ్బెర చెలకలో రూ. 2473, జనగామలో రూ. 935, రాంపూర్‌లో రూ. 803, కొల్లూరులో రూ. 600, కొండం పేటలో రూ. 400 విలువైన లెక్కలు తేలకపోవడంతో ఈ నిధులను రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి కిరణ్, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఏపీవో వెంకటేశ్వర్, ఎస్ఆర్‌పీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పాల్గొన్నారు.


కోటపల్లి ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

సెర్ప్ ఉద్యోగులకు షీటీమ్‌పై అవగాహన

హాజీపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) జిల్లా షీటీమ్ ఎస్.ఐ హైమ ఆధ్వర్యంలో తెలంగాణలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ హాజీపూర్ మండల ఉద్యోగులకు షీటీమ్‌పై అవగాహన నిర్వహించారు. షీటీమ్ సిబ్బంది, హాజీపూర్ మండలం హాజీపూర్ అధ్యక్షురాలు పుష్పలత, పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన టీఎన్‌జీవోస్ నాయకులు

మంచిర్యాల క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణను టీఎన్‌జీవోస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఏటీసీ సెంటర్‌ను ప్రారంభించడానికి వచ్చిన ఆయనను టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఎంపీతో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నాయకులు బాపురావు, గోపాల్, రమేష్ ఉన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన

భీమారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండల కేంద్రంలో అటవీ శాఖ అధికారులు అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. డీఫైఆర్‌వో సుధాకర్ మాట్లాడుతూ అడువుల్లో ఎవరైనా అక్రమంగా చెట్లు నరికినా, ఉచ్చులు అమర్చినా, విద్యుత్ వైర్ల ద్వారా వన్య ప్రాణులకు హానీ చేయలని చూసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్య విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

హాజీపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్య అభ్యసిస్తున్న వైద్య విద్యార్థులు చదువుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలోగల ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల పరిచయ కార్యక్రమానికి కలెక్టర్ కుమార్ దీపక్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి నిష్ణాతులైన అధ్యాపకుల ద్వారా విద్య అందిస్తామన్నారు. విద్యార్థుల అవసరమేరకు ఎం.పి. లాండ్స్ నిధుల నుంచి బస్సు సర్వీసు కల్పించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు క్రీడలకు సంబంధించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు ఏకాగ్రతతో ఇష్టపడి చదివి మంచిర్యాల జిల్లా పేరును రాష్ట్రంలోనే కాకుండా జాతీయస్థాయిలో వినిపించాలని తెలిపారు. ఇటీవల కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జల సంరక్షణ పురస్కారాలలో కలెక్టర్ అవార్డు తీసుకోవడం అభినందనీయమన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, ఎంపీ వంశీకృష్ణ

విద్యార్థులకు సదుపాయాలు కల్పించాం

ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, వైద్య విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను సమకూర్చామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. 32ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 250 కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మాణం చేపట్టామని, వైద్య కళాశాలకు అనుబంధంగా చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు 2 నెలలలో పూర్తి చేసేం దుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా లో విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారి స్తామని, జిల్లాలోని లక్సెట్టిపేట, చెన్నూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో సామాజిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.